# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన రాష్ట్రంలో సాకారమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు సమర్ధవంతంగా పని చేయాలని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సూచించారు.**
3. **త్వరలో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో 3వ స్థానానికి దేశం చేరనుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**
4. **పార్వతీపురం మన్యం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**
5. **ఈరోజు జాతీయ అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన రాష్ట్రంలో సాకారమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలో 5 వేల కోట్ల రూపాయల విలువైన 29 జాతీయ రహదారులకు శంఖుస్థాపన చేయడం, 27 వేల కోట్ల విలువైన 8 ప్రాజెక్టులు ప్రకటించడంపై సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర పురోగతికి ముందడుగన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్వర్ణాంధ్రను సాధిస్తాయని తెలిపారు.

-------------------------

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు సమర్ధవంతంగా పని చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సూచించారు. ఏలూరు జడ్పి చైర్ పర్సన్ జి.పద్మశ్రీ అధ్యక్షతన నిన్న జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వేల కోట్లు నిధులు మంజూరు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు సముచితమైన గౌరవం ఇవ్వాల్సి ఉందని అధికారులకు సూచించారు.

-------------------------

త్వరలో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో 3వ స్థానానికి దేశం చేరబోతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతిలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం పెద్దపీట వేస్తుందని చెప్పారు. గతి శక్తి పథకానికి 111 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారని తెలిపారు. 46 వేల కిలోమీటర్లకుపైగా 4 లైన్ల రహదారులు ఉన్నాయన్నారు. పేదల అభ్యున్నతికి అనేక పథకాలను కేంద్రం అమలు చేస్తుందని పేర్కొంటూ...

...వాయిస్.. 32.. సెకన్లు

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాను సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ ప్రాజెక్టు నుంచి సాగునీటిని మంత్రి నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెదగడ్డ రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీటితో 3 మండలాల్లో 12 వేల 221 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. రిజర్వాయర్ అభివృద్ధి పనులకు 1 కోటి 16 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. రైతుల అభ్యున్నతి, సాగునీటి సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

---------------------------

అన్నదాత సుఖీభవ పథకంలో వినతులను ఈ రోజు నుంచి స్వీకరించనున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన గ్రీవెన్స్ మాడ్యూల్‌లో లబ్ధిదారులు తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే అధికారులు ఈ విషయం పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా కోడ్ అమలులో ఉన్న ప్రాంతాలలో లక్ష మంది రైతులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని.. అలాగే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా – ఎన్.సి.పి.ఐలో మ్యాపింగ్ జరగని మరో లక్ష మంది రైతుల ఖాతాలను కూడా మినహాయించి 44 లక్షల 75 వేల మంది ఖాతాల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు.

---------------------------

ఈరోజు జాతీయ అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అవయవాలను దానం చేస్తే ఎంతోమందికి పునః జీవితాన్ని ప్రసాదించవచ్చనే అంశం పట్ల అవగాహన కలిగించేందుకు ప్రతీఏటా మన దేశంలో ఆగష్టు 3వ తేదీన అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఏ వయసువారైనా అవయవదానం చేయవచ్చు. సహజంగా మరణించినా, రోడ్డు ప్రమాదంలో మరణించినా, బ్రెయిన్ డెడ్ అయినా, వారి అవయవాలను అవసరమైనవారికి అమర్చడం ద్వారా వారికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ సంచికలో అవయవదాన విశిష్టతను గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రాణాపాయంలో వున్న వారిని కాపాడే మహత్తర కార్యక్రమమైన అవయవదానం చేసేందుకు మరింత మంది ముందుకు రావాలని ప్రధానమంత్రి పిలుపునిస్తూ....

వాయిస్ ...35 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో శ్రీకాకుళం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కో యూనిట్ కు 40 లక్షల రూపాయల వరకూ రుణం మంజూరు చేస్తున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ తెలిపారు. ఈ పథకం అమలులో శ్రీకాకుళం జిల్లా అగ్రస్థానంలో ఉందని ఈరోజు పాత్రికేయులకు వివరించారు. అల్పాదాయ వర్గాలు ఇళ్లు నిర్మించుకునేందుకు 10 లక్షల రూపాయాలు రుణం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంటూ...

..వాయిస్ 31 సెకన్లు

---------------------------

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసి జవహర్ నవోదయ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తనిఖీ చేశారు. విద్యాలయంలో జరుగుతున్న మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులను కలెక్టర్ నిన్న పరిశీలించారు. మౌలిక సదుపాయాలకు కోసం 30 లక్షల రూపాయలను తక్షణమే మంజూరు చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యాలయ ప్రిన్సిపాల్‌తో సమావేశమై బోధనా సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, డిజిటల్ తరగతి గదులు, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. భోజన, వసతి సదుపాయాలపై విద్యార్థులతో మాట్లాడారు.

---------------------------

నల్సా సంవాద్ పథకంలో ఆదివాసీ జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయని హై కోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో గిరిజన న్యాయ సేవా శిబిరం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్సా సంవాద్ పథకంలో లీగల్ ఎయిడ్ క్లీనిక్ లు, గిరిజన సాధికారతకు దోహదం చేస్తాయన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...15 సెకన్లు

=====================